నిర్మాణ వ్యర్థాలు పారేస్తే..

వెయ్యి జరిమానా

సీఅండ్‌డీ ప్లాంట్లకు అప్పగించేలా ప్రజల్లో విస్తృత అవగాహన

వ్యర్థాల తరలింపులో ఏజెన్సీల పనితీరులో మార్పు రావాలని కమిషనర్ ఆదేశాలు

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయడానికి వీల్లేదు. నిర్మాణాలు చేపట్టే సమయంలో కానీ, ఇంటి మరమ్మతులు, ఆధునీకరణ చేసే సమయంలో వచ్చే వ్యర్థాలను జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లకు అప్పగించకుండా కొందరు ఖాళీ స్థలాల్లో, చెరువులు, నాలాల పక్కన పడేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు దర్శనమిస్తూ అపరిశుభ్ర నగరంగా మారుతున్నది. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి కీలక నిర్ణయం తీసుకున్నారు. కూల్చివేసిన భవన నిర్మాణ వ్యర్థాలను ఇంటింటికి వెళ్లి సంబంధిత ఏజెన్సీలు తీసుకువెళ్లేలా ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ హైదరాబాద్‌కు కృషి చేస్తున్న జీహెచ్ఎంసీకి ప్రజలు పూర్తిగా సహకరించేలా ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్ డీ ప్లాంట్లకు తరలించేలా అవగాహన కల్పించడం, అనుమతి లేని ప్రదేశాల్లో వ్యర్థాలు డంపింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని గుర్తించి రూ. 1000 జరిమానా విధించాలని కమిషనర్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు పని చేయాలని సూచించారు. నగరం నలువైపులా భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్డ్ (పునర్ వినియోగం)లోకి తీసుకువచ్చేందుకుగాను నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేశామని,టోల్‌ఫ్రీ నంబర్ 1800 120 1159లో, వాట్సాప్ నంబర్ 91009 27073కి ఫోన్ చేసి చెబితే సంబంధిత ఏజెన్సీ వారు వచ్చి వారివారి ప్లాంట్లకు తీసుకువెళ్తారని కమిషనర్ ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

చిట్టీల పేరుతో రూ.2.79 కోట్లు మోసం

నిందితుడి అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): చిట్టీల పేరుతో భారీగా డబ్బులు వసూళ్లు చేసి మోసానికి పాల్పడిన చిట్టీల నిర్వాహకుడిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. డీసీపీ కె.ప్రసాద్ తెలిపిన కథనం ప్రకారం... చందానగర్‌కు చెందిన అప్పంపల్లి సూర్యప్రతాప్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ చిట్స్‌ను ఇంట్లోనే 14 ఏండ్లుగా నిర్వహిస్తున్నాడు. స్థానికంగా అందరికీ నమ్మకం కుదిరిం. దీంతో రూ.లక్ష, రూ.2లక్షలు, రూ.5 లక్షలు, రూ.10లక్షలు, రూ.25లక్షల చిట్స్ వేస్తూ కమీషన్ మాత్రమే తీసుకుంటూ పేరు తెచ్చుకున్నాడు. ఇంతలో 80 మంది నుంచి రూ.2,79,57,438 డబ్బు చిట్స్ పేరుతో వసూలు చేసి ఇటీవల ఎవరికీ చెప్పకుండా ఇల్లు ఖాళీ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి గురించి ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితులు పక్కా ప్లాన్‌తో మోసం చేశాడని గ్రహించి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ విభాగంలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని ఏసీపీ మురళీకృష్ణ నేతృత్వంలోని బృందం దర్యాప్తు జరిపింది. నిందితుడు సూర్యప్రతాప్‌రెడ్డిని కర్మాన్‌ఘాట్‌లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఫ్యాన్సీ నంబర్ల వేలంలో.. ఆర్టీఏకు అరకోటి ఆదాయం

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఫ్యాన్సీ నంబర్ల వేలంలో మంగళవారం ఆర్టీఏ ఖజానాలో రూ.52.52 లక్షలు జమ అయ్యాయి. అందులో భాగంగా టీజీ 09 డీ 0001 నంబర్‌ను రుద్రరాజు రాజీవ్‌కుమార్ అనే వ్యక్తి రూ.11.11 లక్షలకు దక్కించుకున్నారని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ తెలిపారు. టీజీ 09 డీ 0009ను రూ.10.40 లక్షలకు మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ దక్కించుకోగా, టీజీ 09సీ 9999 నంబర్‌ను రూ.7.19లక్షలకు శ్రియాన్ కన్‌స్ట్రక్షన్ కైవసం చేసుకుందని వివరించారు. టీజీ 09డీ 0006ను రూ.3.65 లక్షలకు, టీజీ 09డీ 0005ను రూ.3.45లక్షలకు, టీజీ 09 డీ 0007ను రూ.2లక్షలకు, టీజీ 09డీ 0019ను రూ.1.95లక్షల ధర పలికినట్టు పేర్కొన్నారు.

ఒకే ప్లాట్ పలువురికి విక్రయం

ఘరానా మోసగాడిని అరెస్ట్ చేసిన రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు

సంతోష్‌కుమార్(ఫైల్)

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): నకిలీ డాక్యుమెంట్లతో ఒకే ప్లాట్‌ను పలువురికి విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఛీటర్‌ను రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. మల్కాజిగిరి ఎస్ఓటీ డీసీపీ-1 రమణారెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఈసీఐఎల్, లక్ష్మీపురికాలనీకి చెందిన మన్నెం సంతోష్‌కుమార్ వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారి. అయితే అతను 2021లో నాగోల్‌లోని లక్ష్మీ నర్సింహకాలనీ సర్వే నం.81లోని 131 ప్లాట్‌కు పలు నకిలీ డాక్యుమెంట్లు తయారు చేశాడు. అందులో పశ్చిమం వైపు హరికృష్ణకు 130 గజాలకు రూ.30లక్షలు, ఉత్తరానికి కాసాని శ్రీధర్‌కు 120 గజాలంటూ రూ.40లక్షలు, పశ్చిమంలో మరో పార్ట్ అంటూ విజయకుమార్ భారతిదేవికి రూ.30లక్షలకు, తూర్పు భాగమంటూ దోమకొండ చంద్రశేఖర్‌కు రూ.10లక్షలకు ఇలా ఒకే ప్లాట్‌ను విభజించి డాక్యుమెంట్లు తయారు చేసి పలువురికి విక్రయించాడు. దీంతో బాధితులు నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అలాగే అదే సర్వే నంబర్‌లో ప్లాట్ నం.44లో 167 గజాలు సూర్యప్రకాశ్‌కు రూ.37లక్షలకు విక్రయించాడు. అలాగే అదే ప్లాట్‌ను రాజేశ్‌కు రూ.40లక్షలకు విక్రయించడంతో బాధితులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. 2016లో నేరేడ్‌మెట్‌లోని సత్యనారాయణ అనే వ్యక్తి నుంచి ఏజీపీఏ తీసుకొని ఎస్ఎస్‌బీ క్లాసిక్ అపార్టుమెంట్‌లోని 102, 201 ప్లాట్లను పలువురికి విక్రయించడంతో నేరేడ్‌మెట్‌లో బాధితులు 2022లో ఫిర్యాదు చేయడంతో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే అమాయకులను మోసం చేస్తున్న నిందితుడిని నాగోల్ పోలీసులతో కలిసి మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్ఓటీ డీసీపీ-1 రమణారెడ్డి వెల్లడించారు.

టోలిచౌకీలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపజేస్తున్న నగర సీపీ సీవీ.ఆనంద్ తదితరులు

ట్రాఫిక్ నియంత్రణకు ఆపరేషన్ రోప్

ప్రారంభించిన నగర సీపీ సీవీ ఆనంద్

ఫుట్‌పాత్ ఆక్రమణలను అందరూ అడ్డుకోవాలి

మెహిదీపట్నం, నవంబర్ 26: నగరంలో వాహనాల రద్దీ రోజు రోజుకు పెరుగుతుందని, దీని వల్ల ట్రాఫిక్ ఎక్కువ అవుతున్నదని, ట్రాఫిక్‌ను నియంత్రించాలంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అందరూ పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మంగళవారం నగరంలోని టోలిచౌకీ నుంచి షేక్‌పేట్ వరకు ఉన్న ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ రోప్'ను సీపీ సీవీ.ఆనంద్ ప్రారంభించి మాట్లాడారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను అడ్డుకోవడం, తొలగించడం, అక్రమ పార్కింగ్‌లను నివారించడం.. ఆపరేషన్ రోప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేసే వ్యాపారాలను తాము ఉపేక్షించబోమన్నారు. ట్రై కమిషనరేట్ల పరిధిలో పెరుగుతున్న వాహనాల కారణంగా నగర ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందని చెప్పారు. వాహనాల రద్దీ పెరగడంతోపాటు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే ట్రాఫిక్‌కు ప్రధాన కారణాలని తెలిపారు.

ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరించాలని సీపీ సీవీ.ఆనంద్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆర్కేపురం, నవంబర్ 26: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా తప్పులు చేస్తుందని, వారు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, పేద వాళ్లకు న్యాయం చేయవలసిన అవసరం ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి కూనంనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు తిరిగి ఇస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని, అదే విధంగా అదానీ చేసుకున్న ఒప్పందాలలో ఏమైనా అవినీతి జరిగిందా? అనే కోణాన్ని కూడా ప్రభుత్వం బయట పెట్టాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డికి లంచం ఇచ్చినట్టు అమెరికాలో తేలిందని, ఇక్కడ ఎవరికైనా ఇచ్చారా? అనే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. హర్యానా ఓటమికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని, వారికి స్వయం కృతాపరాధం, స్వీయ అహంకారంతోనే ఓడిపోయిందని అదే ప్రభావం మహారాష్ట్ర ఎన్నికల్లో పడిందన్నారు. అదానీపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నా కూడా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విచారణ చేయకపోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. దొంగలకు తోడ్పాటు ఇచ్చే విధంగా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోదీ వ్యవహరిస్తున్నారన్నారు. మతం, సెంటిమెంట్, కులం పేరుతో చేసే రాజకీయాలు తాత్కాలికమని, మహారాష్ట్ర లాంటి ఫలితాలు మళ్లీ కావని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ముత్యాల యాదిరెడ్డి, పర్వతాలు, ఫమీద, బాత రాజు నరసింహ ఉన్నారు.

జీడిమెట్లలో భారీ అగ్నిప్రమాదం

జీడిమెట్ల, నవంబర్ 26: జీడిమెట్ల దూలపల్లి రోడ్డులోని ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో పరిశ్రమలోని మూడు ఫోర్లు మంటల్లో తగలబడిపోయి మంటల తాకిడికి భవనం కూలిపోయింది. అగ్ని ప్రమాదం సంభవించగానే పరిశ్రమలోని కార్మికులంతా బయటకు పరుగులు తీశారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. పరిశ్రమకు చెందిన ముడి సరుకులు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండటంతో యాజమాన్యం వాటిని వీలైనంత మేర వేరే చోటుకు చేరవేసింది. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక అధికారుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫేజ్-5 దూలపల్లి రోడ్డులో సిరాజుద్దీన్ అనే వ్యక్తి ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమను నడుపుతున్నాడు. పరిశ్రమ గ్రౌండ్ ఫ్లోర్‌తో కలుపుకుని రెండు ఫ్లోర్లు ఉండగా.. ఆ పైన పెద్ద రేకుల షెడ్డును నిర్మించారు. పరిశ్రమలో మొత్తం 500 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. మంగళవారం జనరల్ షిఫ్ట్ లో సుమారు 200 మంది కార్మికులు పరిశ్రమలో ఉన్నారు. మధ్యాహ్నం పరిశ్రమ 3వ అంతస్తు రేకుల షెడ్డులో కొంత మంది కార్మికులు ఆర్.పి. (రీప్రాసెసింగ్) మిషన్ వద్ద పనులు నిర్వహిస్తున్నారు. సరిగ్గా 12:30 గంటలకు రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో కార్మికులు బతుకు జీవుడా అంటూ కిందకు పరుగులు తీశారు. వెంటనే పరిశ్రమ సిబ్బంది జీడిమెట్ల అగ్ని మాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బందికి 3వ అంతస్తుకు నీటిని చిమ్మడం కష్టంగా మారింది. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ నిల్వలు ఉండటంతో భారీగా మంటలు అంటుకున్నాయి. ఫైర్ అధికారి శేఖర్‌రెడ్డి ప్రమాద తీవ్రతను పైఅధికారులకు తెలుపడంతో కూకట్‌పల్లి 2, సికింద్రాబాద్ 2, సనత్‌నగర్ 1, కూకట్‌పల్లి 2, మాదాపూర్ 1, జీడిమెట్లకు చెందిన మరో రెండు వాహనాలు కలిపి మొత్తం 8 వాహనాలు పరిశ్రమ వద్దకు తెప్పించారు. దాదాపు ఐదు ఫైర్ స్టేషన్‌ల నుంచి వచ్చిన 50 మందికి పైగా అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు.

ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

నల్లటి పొగలతో ఊపిరాడక సతమతమైన అగ్ని మాపక సిబ్బంది

పరిశ్రమలో ప్లాస్టిక్ అంటుకోవడంతో తీవ్రమైన నల్లటి పొగలు పెద్దఎత్తున వెలువడ్డాయి. దీంతో ఫైర్ సిబ్బంది లోపలికి వెళ్లి నీరు కొట్టలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికే ఫైర్ ఆఫీసర్లు, సిబ్బంది నల్లటి పొగలతో చాలా ఇబ్బంది పడుతూ మంటలను ఆర్పేందుకు తీవ్రంగా యత్నించారు. జీడిమెట్ల మాజీ ఐలా చైర్మన్ రామకృష్ణ, జేఏసీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి అక్కడికి చేరుకుని వివిధ ప్రాంతాల నుంచి నీటి ట్యాంకులను తెప్పించడంతోపాటు ఫైర్ సిబ్బందికి ఆహారాన్ని అందజేశారు. మూడవ అంతస్థు లోపలికి నీటిని చిమ్మడం కష్టంగా మారడంతో ఫైర్ అధికారులు బ్రాంటో స్కైలిఫ్ట్ తెప్పించి దానితో లోపలికి నీటిని చిమ్మారు. ఇంకా మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రమాద స్థలాన్ని డీఎఫ్ఓలు జయకృష్ణ, త్రిదాసా, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ లతో పాటు వివిధ విభాగాల అధికారులు సందర్శించారు.

కార్మికుడి ప్రాణం ఖరీదు రూ.6.50లక్షలు

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజీ కుదిర్చిన మధ్యవర్తులు

బండ్లగూడ, నవంబర్ 26: ఓ భవనం నిర్మాణంలో పని చేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లి, భార్య పిల్లలు రోడ్డున పడ్డారు. మధ్యవర్తులు అతడి ప్రాణానికి వెల కట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో వారు కన్నీరుమున్నీరై పోలీస్‌స్టేషన్‌లో రోదిస్తూ కనిపించారు. ఏం జరిగిందని వారిని కదిలించగా.. అసలు విషయం తెలిసింది. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ్‌పేట్ జిల్లా దామరగిద్ద మండలం కనుకుర్తి గ్రామానికి చెందిన నర్సింహలు(28), సంతోష దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పదేళ్ల కిందట కాళీమందిర్ ప్రాంతానికి వలస వచ్చి స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కాగా, నర్సింహలు సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవానీ కాలనీలో ఓ భవనం నిర్మాణంలో పని వెళ్లాడు. గోవా కట్టెలు కడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో స్థానికులు ఓ ఆస్పత్రికి తరలించగా.. అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కన్నీరుమున్నీరవుతున్న మృతుడి తల్లి, భార్యాపిల్లలు

రాజీ కుదిర్చిన మధ్యవర్తులు..

నర్సింహలు మృతి చెందడంతో ప్రమాదం జరిగిన ఇంటి యజమాని తరపున మధ్యవర్తులు రంగంలోకి దిగారు. మృతుడి కుటుంబీకులను మభ్యపెట్టి పలు దఫాలుగా చర్చలు జరిపి రూ.6లక్ష 50వేలకు ఒప్పించారు. ఇందులో భాగంగానే కొంత నగదు మంగళవారం చెల్లించి మిగతాది పలు దఫాలుగా చెల్లించేందుకు ఒప్పించినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న నర్సింహలు మృతి చెందడంతో మంగళవారం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో అతడి భార్య, తల్లీపిల్లలు, కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు.

డిప్యూటీ కలెక్టర్‌నని నమ్మించి..

వర్క్ వీసాల పేరిట టోకరా

వెంగళరావునగర్, నవంబర్ 26: కెనెడా దేశంలో ఉద్యోగం కోసం వీసాలు ఇప్పిస్తానని నమ్మించి అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ నుంచి రూ.12.5 లక్షల వరకు వసూలు చేసిన నకిలీ కలెక్టర్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నల్లగండ్లకు చెందిన దండా చంద్రబాబు అమర్‌పేట ధరంకరం రోడ్డులో మన్నెం సర్వీసెస్ పేరిట ఓవర్సీస్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. కాగా, ఇటీవల చింత సురేశ్ అనే వ్యక్తి తాను విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. తన వెంట పట్నాల శంకర్ అనే మిత్రుడిని కూడా తీసుకువచ్చాడు. తనకు విదేశాల్లో చాలా పలుకుబడి ఉందని, తాను వర్క్ వీసాలను తేలిగ్గా ఇప్పిస్తానని నమ్మించాడు. కన్సల్టెన్సీ ద్వారా వీసాల కోసం వచ్చేవారి వివరాలను ఇస్తే తాను వీసాలిప్పిస్తానని చెప్పాడు. ఇందుకు కన్సల్టెన్సీ నిర్వాహకుడు చంద్రబాబు వద్ద దఫదఫాలుగా రూ.12.5 లక్షలు వసూలు చేశాడు. మరింత డబ్బు కోసం డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చి అతడి గురించి విచారించాడు. అతను మోసగాడని తెలిసి తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరాడు. ఇందుకు సురేశ్ దుర్భాషలాడుతూ, బెరింపులకు గురి చేయడంతో మోసపోయానని తెలుసుకుని బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బలవంతపు వసూళ్లు..

ఏడుగురు ట్రాన్స్‌జెండర్స్ అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): కొత్తగా గృహప్రవేశం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని డబ్బు కోసం పట్టి పీడిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడటమే కాకుండా న్యూసెన్స్ చేస్తున్న ఏడుగురు ట్రాన్స్‌జెండర్లను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బోయగూడకు చెందిన పప్పీ, మాదాపూర్‌కు చెందిన కుషీ చౌహాన్, మెహిని, అన్ని, యూసుఫ్‌గూడకు చెందిన అంజలీ, స్టెల్లా రాయ్, సాయి పల్లవి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. ఎవరైనా కొత్తగా ఇల్లు కడుతున్నారంటే అంతే ఇక అక్కడకు వెళ్లి హంగామా సృష్టించి యజమాని వద్ద బలవంతంగా డబ్బులు తీసుకుంటూ న్యూసెన్స్ చేస్తుంటారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఇలాంటి ఘటనపై కేసు నమోదైంది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ ఏడు మందిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపారు.

వేధిస్తున్న 66 మంది పోకిరీల అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మహిళలు, బాలికలను వేధిస్తున్న 66 మంది పోకిరీలను అరెస్ట్ చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. వేధింపులపై బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఆయ సూచించారు. బస్లాండ్‌లు, రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయి ఆపరేషన్లు చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఈ 15 రోజుల్లో కమిషనరేట్ పరిధిలో పట్టుబడ్డ 66 మందికి షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ నేతృత్వంలోని ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీస్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఆరుగురిపై క్రిమినల్ కేసులు, 10 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశామని, మిగతా వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు.

నేడు వాహనాల వేలం

బండ్లగూడ, నవంబర్ 26 : శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యంతోపాటు వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ జి.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ద్విచక్ర, ఆటోల వేలం పాట ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26: హిందీ మహా విద్యాలయం విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఫెయిలైన విద్యార్థులకు సైతం అవసరమైతే ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ఆ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల అకాడమిక్ భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తరగతులను ఆ కళాశాలలోనే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యానికి లిఖితపూర్వకంగా తెలిపినట్లు వివరించారు. విద్యార్థుల ప్రయోజనాలే వర్సిటీ మొదటి ప్రాధాన్యమన్న ఆయన ఓయూ ప్రతిష్టకు భంగం కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించబోమని ఉద్ఘాటించారు.

ఎల్ఐసీ కొత్త కార్యవర్గం

ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలి

కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు నాలుగేండ్లు అవుతున్న దృష్ట్యా మంగళవారం ఎల్ఐసీ జోనల్ ఆఫీసులో ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. 2020 నవంబర్ 26వ తేదీన రైతుల దేశ వ్యాప్త నిరసన ఫలితంగా కేంద్రం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకుందని చెప్పారు. కానీ నేటికీ ఇతర ప్రధాన డిమాండ్లలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. దేశంలో నెలకొన్న తీవ్ర నిరుద్యోగం, నిత్యావసర ధరలు పెరగడం, ఆర్థిక అసమానతలు, కార్మికుల్లో మతపర విభజన తీసుకొస్తుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజల సమస్యలను ప్రధాన ఎజెండాగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ఐసీతోపాటు అనేక ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేసేలా కార్యాచరణ ఉండాలని హితవు పలికారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం ఇటీవల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన బెంగళూరు 13వ జోనల్ మహాసభలో ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, జోనల్ అధ్యక్షుడు ఈ.సతీశ్, జోనల్ సంయుక్త కార్యదర్శి త